క్లుప్తంగా

కల్యాణ మండపం ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన కల్యాణ మండపాన్ని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లుకాస్, వాసిరెడ్డి శ్రీధర్ ప్రసాద్, నాగేశ్వర్‌రావు, అశోక్‌గౌడ్, వెంకటరెడ్డి, ప్రదీప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామంతాపూర్: దేవేందర్‌నగర్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు సుమారు 200 మందిని పరీక్షించారు. నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సిప్కో ఫార్మాస్యూటికల్స్, ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్, బ్రిటిష్ బయోలాజికల్స్, నైవిక్ హెల్త్ కేర్ సర్వీసెస్, కృప దయాగ్నస్టిక్స్‌తో పాటు శిబిరంలో పాల్గొన్న వైద్యులకు చర్చి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

20న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఉప్పల్: హబ్సిగూడ డివిజన్ పరిధిలో అధికారులు చొరవ తీసుకుని విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని డీఈ సాయిప్రసాద్ తెలిపారు. ఎస్ఈ కార్యాలయం ఆవరణలో 20 తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. బిల్లుల్లో హెచ్చుతగ్గులు, లో ఓల్టేజ్ సమస్యలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి


భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పించిన జేఏసీ నాయకులు

అల్వాల్: అల్వాల్‌లోని జేఏసీ ప్రాంగణంలో జేఏసీ నాయకులు భాగ్యరెడ్డి వర్మ 84వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. తెలంగాణలో ఎన్నో స్కూల్స్ ప్రారంభించారని, బలహీన వర్గాల ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీరాములు, సీఎల్ యాదగిరి, చంద్రశేఖర్, నిమ్మ అశోక్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం

నాగోలు: విద్యార్థులకు చదువుతోపాటు అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని బచ్‌పన్ స్కూల్స్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల రీజనల్, అకడమిక్ డైరెక్టరు శ్రీకాంత్‌రెడ్డి, రూపారెడ్డి అన్నారు. కొత్తపేట బచ్‌పన్, అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల వార్షికోత్సవం కొత్తపేటలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అన్ని విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను బయటకు రాబట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జితేంద్రదేవి, పంకజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవ చండీ యాగం

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లోని రేణుక రాజేశ్వరి పీఠం జగన్మాత ఆలయంలో మొల్లురి నవీన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్ర సహిత నవ చండీ యాగం రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. యాగంలో కార్పొరేటర్ మొద్దు లచిరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాలనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రదీప్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


సీఫెల్‌కాలనీ సిద్ధివినాయక దేవాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్


రామలింగేశ్వర గుడిలో శివపార్వతుల కల్యాణానికి హాజరైన కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి

త్రినేత్రుడికి ఘన పూజలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం శైవాలయాల్లో వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే శివ దర్శనం కోసం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రిపూట భక్తులు జాగరణ చేసేందుకు పలు ఆలయాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

– ఉప్పల్, మల్కాజ్‌గిరి జోన్ల బృందం


నాచారంలోని మహాకాళి ఆలయంలో.. ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్


రామంతాపూర్‌లోని సిమ్ లయన్ ఫిట్‌నెస్ సెంటర్‌లో జిమ్ పరికరాలతో ఏర్పాటు చేసిన శివలింగానికి పూజలు చేస్తున్న నిర్వాహకుడు జయసింహ,ట్రైనర్స్


మల్లాపూర్ నందీశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి


వినాయక్‌నగర్‌లోని శివాలయంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పూజలు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం


శ్రీరంగవరంలో మహిళలతో మాట్లాడుతున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: నియోజకవర్గంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ గతంలో ప్రజలకు ఏం చేసింది తిరిగి అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో వివరిస్తామని పీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. పీసీసీ చేపట్టిన హత్ సే హత్ జోడో యాత్ర స్ఫూర్తిగా మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామంలో యాత్ర నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇచ్చారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో మేడ్చల్ నియోజకవర్గం పూర్తిగా వెనుకపడిపోయిందని,పేద పిల్లలు చదవుకోవడానికి కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకుండా పోయిందని అన్నారు.పట్టణాలలో ఎన్నో సమస్యలు తాండవం చేస్తున్నాయని ప్రతీ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తునే ప్రజలకు ప్రభుత్వ వైఫల్యలను వివరిస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా మంత్రి మల్లారెడ్డి ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో నియోజకవర్గ ప్రజల సమస్యలను లేవనెత్తి పరిష్కారాలు సాధించకుండా అసెంబ్లీ సమావేశాలలో కామెడీలు చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల భజనలు చేస్తున్నారని విమర్శించారు.. కార్యక్రమంలో నాయకులు జీనత్‌రెడ్డి, పోచయ్య, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగుట్ట అభివృద్ధికి కృషి చేస్తాం


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: ఇచ్చిన హామీ మేరకు వీరన్న గుట్టను రూ. 13 కోట్లతో అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ వీరన్నగుట్టను శనివారం కాలనీవాసులతో కలిసి సందర్శించారు. వీరన్నగుట్ట చుట్టూ రూ. 1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... వీరన్నగుట్ట అభివృద్ధిలో కాలనీల ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీకి ఒక్కరి చొప్పున తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. రాబోయే రెండేళ్లలో గుట్ట పరిసర ప్రాంతాలను సుందరీకరించి ఆహ్లాదంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గుట్ట అభివృద్ధికి హెచ్ఎండీఏ నుంచి రూ. 13 కోట్లు మంజూరు చేయించామని అంటూ తాను హామీ ఇస్తే ఒకరోజు అటో ఇటో వంద శాతం ఆ హామీని నెరవేరుస్తానని దేవిరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, ధనలక్ష్మీ, జగదీశ్‌యాదవ్, నరహరిశెట్టి, కె.కె.ఎల్.గౌడ్, కడమంచి అనంద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో తెలంగాణ: బీజేపీ


మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

నాగోలు: నీళ్లు, నిధులు, నియామకాల సాధనే లక్ష్యం ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కల్వకుంట్ల కుటుంబ రాజ్యాంగం అమలవుతోందని, మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా సీఎం కేసీఆర్ మార్చారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆరోపించారు. కొత్తపేట డివిజన్‌లో బీజేపీ నాయకులు యప్పాలగౌడ్, ఉపేందర్ సింగ్, సాయినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిచిన కార్నర్ మీటింగ్–ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామ రంగారెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని ధ్వజమెత్తారు. ప్రజలకు దళిత 'బంధు రాలే, మూడు ఎకరాల భూమి రాలే, వృద్ధులకు పింఛన్ రాలే, రేషన్ కార్డులు రాలే' అని వారు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ని డల్లాస్‌లా మారుస్తానన్న సీఎం కేసీఆర్ కనీసం డివిజన్ అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. జీహెచ్ఎంసీని సైతం అప్పుల ఉబిలోకి తోసేశారని వాపోయారు. బీజేపీ అధికారంలో లేకపోయినా కార్పొరేటర్లుగా జీహెచ్ఎంసీ అధికారులతో కొట్లాడి డివిజన్ అభివృద్ధికి నిధులు సాధిస్తున్నామన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే నిజమైన అభివృద్ధి అంటే ఏంటో సాధించి చూపిస్తామని వారు పేర్కొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన హాస్పిటల్‌పై కేసు నమోదు

నాగోలు: ఓ వ్యక్తి మరణానికి కారణమైన హాస్పిటల్‌పై ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మూడు రోజుల క్రితం ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ రవీందర్ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కామినేని హాస్పిటల్ వైద్యులు, మేనేజ్‌మెంట్‌పై 304ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. 14 రోజుల క్రితం హెర్నియా ఆపరేషన్ కోసం రవీందర్‌కు చిన్న సర్జరీ చేయాలని చెప్పి కామినేని హాస్పిటల్‌లో జాయిన్ చేసుకుని చివరికి చంపేశారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్జరీ సమయంలో మత్తు మందు డోస్ అధికంగా ఇచ్చారని... అయితే మత్తు మందు పడలేదని ఐసీయూలో వెంటిలేటర్‌పై పెట్టాలని చెప్పి లక్షలాది రూపాయల డబ్బులు దండుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి చికిత్స పొందుతూ రవీందర్ మృతి చెందాడని, శవాన్ని తీసుకెళ్లాలని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్లు మృతుడి బంధువులు పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రవీందర్ చనిపోయాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆపరేషన్ చేసిన డాక్టర్ కృష్ణా చౌదరి తోపాటు ఆస్పత్రి మేనేజ్‌మెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడ్ నేపథ్యంలో ఫ్లెక్సీల తొలగింపు

మేడ్చల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. మండలంలోని గుండ్లపోచంపల్లి–నూతన్‌కల్ రోడ్డులో గౌడవెల్లి పరిధిలో కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ శివరాత్రి సందర్భంగా గుడిబండ ఆలయానికి వస్తున్న భక్తులకు స్వాగతం తెలుపుతూ భారీ గా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదుతో రెవెన్యూ, పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులు బృందంగా వెళ్లి శనివారం ఫ్లెక్సీలను తొలగించారు.ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందునే ఫ్లెక్సీలను తొలగించామని అధికారులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య

సికింద్రాబాద్: గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. లాలాగూడ–మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాలపై శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో సుమారు 50 ఏళ్ల పైబడిన గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

బీఆర్ఎస్ ప్రజలను మోసం చేస్తోంది: దుగ్యాల


సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

మల్లాపూర్: ఎన్నికల ముందు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. నాచారం డివిజన్ హనుమాన్ నగర్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జి హనుమంత్ బిరదర్ ఆధ్వర్యంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక సమస్యలపై బీజేపీ కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, పద్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్, అనితారెడ్డి, రవీందర్ రావు, సంజీవ రెడ్డి, ఓంకార్, హనుమంత్, శ్రీధర్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం'

వనస్థలిపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కూడా నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి వనస్థలిపురంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళిత సీఎం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉద్యోగాల భర్తీ తదితర హామీలను కేసీఆర్ నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. కేసీఆర్, మంత్రి కేటీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశం ప్రగతిపథంలో పయనిస్తోందని అన్నారు. త్వరలో తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు రాబోతుందని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీ జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19 (నేటి)నుంచి మార్చి 1వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణ, 24న గరుడ వాననసేవ, 27న రథోత్సవం, 28న చక్రస్నానం, మార్చి 1న పుష్పయాగం తదితర పూజలు జరుగుతాయన్నారు. వీటితోపాటు ప్రతిరోజూ స్వామివారి విశేష వాహన పూజలు ఉంటాయన్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

భువనగిరి ఖిల్లాను సందర్శించిన విద్యార్థులు



బోడుప్పల్: చెంగిచర్ల విద్యాజ్యోతి స్కూల్ విద్యార్థులు జాతీయ నేతృత్వంలో నడుస్తున్న హిందూస్తాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఆక్టివిటీలో భాగంగా భువనగిరి ఖిల్లాను సందర్శించారు. ఖిల్లాపై ట్రెక్కింగ్ నిర్వహించారు. భువనగిరి కోట, కట్టడాలు, ప్రాకారాలను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఆకవరం శ్రావణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, స్కాట్ అండ్ గ్రైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ కర్రు స్నేహిత్, స్కాట్ మాస్టర్ మల్లికార్జున్, రమేష్, భాస్కర్,కృష్ణవేణి, శ్రీను పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా పునాదులు వేసుకోవాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన పూర్వ విద్యార్థులను, క్రీడల్లో వివిధ విభాగల్లో విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రసార సాధనాల వల్ల కలిగే పరిణామాల గురించి వివరించే నాటక ప్రదర్శన సందేశాత్మకంగా నిలిచింది. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ రూపారెడ్డి, డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, కో ఆర్డినేటర్ సునీత, ప్రిన్సిపాల్ నళినిజయ, వైస్ ప్రిన్సిపాల్ నీలిమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

